www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 1 జనవరి 2025
5
పశ్చిమ గోదావరి



నూతన సంవత్సర శుభాకాంక్షలు

జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి



నూతన సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలి. సరికొత్త విజయాలను అందుకొని సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలి. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీస్ శాఖకు తమ వంతు సహకారం అందించాలి. జిల్లాలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి, వైట్ కలర్ నేరాల నిరోధానికి, మహిళలపై అఘాయిత్యాల నివారణకు కృషి చేస్తాం. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

కొత్త ఏడాదిపై..

ఆశలు.. ఆకాంక్షలెన్నో..!

2024 సంవత్సరానికి వీడ్కోలు పలికి.. కొత్త సంవత్సరం 2025లోకి జిల్లా ప్రజానీకం అడుగుపెట్టారు. తమ బతుకులు ఈ ఏడాదిలోనైనా మారాలని కోరుకుంటూ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. జిల్లాను దీర్ఘకాలికంగా పట్టిపీడిస్తున్న సమస్యలు ఈ ఏడాదైనా ప్రభుత్వం పరిష్కరిస్తుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. తాగునీటి సమస్య నుంచి పెరిగిన ధరల వరకూ అనేక సమస్యలతో జిల్లా ప్రజానీకం సతమతమవుతున్నారు. ఎన్నికల్లో జిల్లా అభివృద్ధికి అనేక హామీలు గుప్పించిన కూటమి సర్కార్ జిల్లా ప్రజలను దీర్ఘకాలికంగా వెంటాడుతున్న సమస్యలపై దృష్టి సారించి 2025లో ప్రజలు సంతోషంగా గడిపేలా చేస్తుందో, లేదో వేచిచూడాలి.



కొండెక్కిన నిత్యావసరాల ధరలు తగ్గేనా?

కౌలురైతుల కన్నీటి వ్యథ తీరేనా

పోలవరం నిర్వాసితులకు పరిహారం అందించేనా

చింతలపూడి రైతులకు న్యాయం జరిగేనా

తాగునీటి సమస్యను పరిష్కరించేనా

కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణం చేసేనా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రస్తుతం ప్రజలను వెంటాడుతున్న సమస్యల్లో అధిక ధరలు అత్యంత ముఖ్యమైన అంశంగా చెప్పొచ్చు. కొండెక్కిన నిత్యావసర ధరలతో సామాన్య ప్రజానీకం అల్లాడిపోతున్నారు. కడుపు నిండా పట్టెడు అన్నం తినలేని స్థితికి సామాన్య కుటుంబాలు చేరాయి. కందిపప్పు కిలో రూ.175 పలుకుతుండగా, మినపప్పు, పచ్చిశెనగపప్పు వంటి ధరలు కిలో రూ.115 వరకూ పలుకుతున్నాయి. వంటనూనెలు కిలో రూ.140 దాటేశాయి. వెల్లుల్లి కిలో రూ.400 దాటగా, మిర్చి కిలో రూ.240కు చేరుకుంది. ఇలా అన్ని నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు ఎగబాకాయి. గతంలో నెలసరి సరుకులకు రూ.రెండు వేలు ఖర్చయితే ఇప్పుడు అవే సరుకులకు రూ.ఐదువేల వరకూ ఖర్చు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. ఇక ఉల్లి, టమోటా వంటి ధరలు అమాంతంగా పెరుగుతున్న తీరు జనాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో కిలో కందిపప్పు వాడే కుటుంబాలు అర కిలోతోనే సరిపెట్టుకుంటున్నాయి. ఇప్పటికీ ఆక్వా పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు రోజంతా కష్టపడితే రూ.250 వేతనమే వస్తోంది. ఆసుపత్రులు, ఎటిఎంల వద్ద పని చేసే సెక్యూరిటీ సిబ్బంది వేతనం నెలకు రూ.తొమ్మిది వేలు మించిలేదు. ప్రయివేటు స్కూళ్ల పని చేసే ఉపాధ్యాయులకు రూ.పది వేలు వేతనం రావడమే గగనంగా ఉంది. నెలకు రూ.పదివేలలోపు వేతనం తీసుకునే కార్మికులు, ఉద్యోగులు, వ్యవసాయ కూలీలు జిల్లాలో మూడొంతులు మంది ఉన్నారు. ధరలు పెరుగుతున్నాయే తప్ప ఆదాయాలు మాత్రం అందుకు తగినట్లుగా పెరగకపోగా ఇంకా తగ్గుతున్న పరిస్థితి ఉంది. ఇలాంటి కుటుంబాలన్నీ ధరల పెరుగుదలతో అర్ధాకలితోనే కాలం వెళ్లదీస్తున్న పరిస్థితి. ఇది సామాన్యుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రోటీన్ లోపంతో అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు చెబుతున్న మాటలన్నీ వట్టి బూటకంగానే మారాయి. 2025లోనైనా ధరలు తగ్గాలని జనం కోరుకుంటున్నారు. ప్రభుత్వాలు ఏవిధంగా ముందుకు సాగుతాయో వేచిచూడాలి.

కౌలురైతుల కన్నీటి వ్యథలు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వ్యవసాయ సాగులో 80 శాతం కౌలురైతులే చేస్తున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల కౌలురైతుల కుటుంబాలు ఉన్నాయి. వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతులను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. సాగు చేయని భూయజమానులకు ప్రభుత్వం సాయం చేస్తోంది. ఆరుగాలం కష్టపడిన కౌలురైతులకు ఏమాత్రం మేలు చేయడం లేదు. పంట రుణాల మంజూరు నుంచి పంట నష్టపరిహారం, బీమా ఏఒక్కటీ కౌలురైతులకు దక్కడం లేదు. కౌలుచట్టంలో మార్పులు చేసి కౌలురైతులకు న్యాయం చేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. అధికారం చేపట్టి ఆరు నెలలైనా ఇప్పటికీ ఉలుకుపలుకు లేదు. కొత్త సంవత్సరంలోనైనా కౌలురైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందో, లేదో వేచిచూడాలి.

పోలవరం నిర్వాసితులకు పరిహారం అందేనా.. చింతలపూడి రైతులకు న్యాయం జరిగేనా?

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేస్తామని, పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షలకు పెంచుతామని 2006కు ముందు సేకరించిన భూములకు రూ.ఐదు లక్షల పరిహారం ఇస్తామని హామీ ఇచ్చి 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ఐదేళ్ల పాలనలో పోలవరం నిర్వాసితులను పట్టించుకోలేదు. కాపర్ డ్యామ్ పూర్తి కావడంతో జులై, ఆగస్టు నెలల్లో విరుచుకుపడుతున్న గోదావరి వరదలకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని దాదాపు 20 వేలకుపైగా కుటుంబాలు నానా ఇబ్బందులు పడుతున్నాయి. 2026కు పోలవరం పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ముందుగా పోలవరం నిర్వాసితులకు పరిహారం ఇవ్వాల్సి ఉంది. కొత్త ఏడాదిలోనైనా పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించి న్యాయం చేస్తారో, లేదో వేచిచూడాలి. 2025లోనైనా పోలవరం నిర్వాసితులకు కష్టాల నుంచి విముక్తి కల్పించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. మరోపక్క చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న బాధిత రైతులు న్యాయమైన పరిహారం కోసం గడిచిన పదేళ్లుగా పోరాటం చేస్తున్నారు. మార్కెట్‌లో ఎకరా భూమి రూ.50 లక్షలు ఉండగా, ప్రభుత్వం మాత్రం ఎకరాకు రూ.12 లక్షలు, రూ.19 లక్షలు మాత్రమే ఇస్తామని రైతులకు అన్యాయం చేసేందుకు పూనుకుంది. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఈ ఏడాదైనా చింతలపూడి ఎత్తిపోతల బాధిత రైతులకు న్యాయమైన పరిహారం ఇచ్చి సమస్యను పరిష్కరిస్తారో లేదో చూడాలి.

తాగునీటి కష్టాలు తీరేనా.. కొల్లేరు రెగ్యులేటర్ నిర్మాణం జరిగేనా?

రెండు జిల్లాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యల్లో తాగునీటి సమస్య ఒకటి. ముఖ్యంగా డెల్టాలో తాగునీటి సమస్య అత్యంత తీవ్రంగా ఉంది. పక్కనే గోదావరి ఉన్నా తాగేందుకు గుక్కెడు నీళ్లు లేకుండాపోయాయి. విచ్చలవిడిగా తవ్విన ఆక్వా చెరువులతో తాగునీటి వనరులన్నీ పూర్తిగా కలుషితమయ్యాయి. దీంతో ప్రతి కుటుంబమూ తాగునీరు కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. పాలు కంటే నీళ్ల కోసమే ఎక్కువ ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి దాపురించింది. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు టిడిపి ప్రభుత్వం గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా తాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పింది. అయితే చేయలేదు. తర్వాత వచ్చినా వైసిపి సైతం వాటర్ గ్రిడ్ పథకంపై హడావుడి చేయడం తప్ప ఒక్క అడుగూ ముందుకు వేయలేదు. దీంతో తాగునీటి సమస్య జనాన్ని వెంటాడుతూనే ఉంది. 2025లోనైనా తాగునీటి సమస్యకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రెండు జిల్లాల ప్రజానీకం కోరుకుంటున్నారు. కొల్లేరులోకి సముద్రం నుంచి ఉప్పు నీరు ప్రవేశించకుండా రెగ్యులేటర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వైసిపి ప్రభుత్వం తెగ హడావుడి చేసింది. దుంపగడప, మొళ్లపర్రు, పడితడక వద్ద మొత్తం మూడు రెగ్యులేటర్ల నిర్మాణానికి ప్రణాళికలు రచించి రూ.450 కోట్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పనులు మాత్రం జరగలేదు. కూటమి ప్రభుత్వమైనా రెగ్యులేటర్ల నిర్మాణం పూర్తి చేయాలని కొల్లేరువాసులు కోరుకుంటున్నారు. అదేవిధంగా గత ఐదేళ్లుగా పడకేసిన డెల్టా ఆధునికీకరణను పూర్తి చేయాలని జిల్లా రైతాంగం ఎంతో ఆశగా ఎదురుచూస్తోంది.

'అక్షర'కు ప్రజలు సహకరించండి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో అక్షర కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి రూపొందించడం అభినందనీయమని, ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజానీకం హస్తాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కలెక్టరేట్లో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి కలెక్టర్ నాగరాణి అక్షర గోడపత్రికను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల్లో బొకేలు, శాలువాలకు బదులుగా వినూత్న ఆలోచనతో ముందుకు రావాలన్నారు. పుస్తకాలు, పెన్నులు వంటివి ఇస్తే అక్షర కార్యక్రమంలో నిరుపేద విద్యార్థులకు అందించడం జరుగుతుందన్నారు. తమను కలిసేందుకు, శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే అధికారులు, ఇతరులు పూల బొకేలు, మొక్కలు, పూల దండలు, శాలువాలతో కాకుండా నిండు మనస్సు, అభిమానంతో శుభాకాంక్షలు చెబితే చాలన్నారు. అదే ఖర్చుతో పేద విద్యార్థులకు ఉపకరించే పుస్తకాలు, పెన్నులు వంటివి ఇస్తే మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, డిపిఆర్ఒ టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ఈ నెల 3, 4, 5 తేదీల్లో భీమవరంలో నిర్వహిస్తున్న సిపిఎం 26వ మహాసభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం పిలుపునిచ్చారు. స్థానిక మెంటేవారి తోటలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మహాసభల వివరాలను బలరాం వెల్లడించారు. 3వ తేదీ మధ్యాహ్న రెండు గంటలకు కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకూ భారీ ప్రజాప్రదర్శన నిర్వహించనున్నామని తెలిపారు. అనంతరం పాత బస్టాండ్ సెంటర్లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ బహిరంగ సభ ప్రాంగణానికి విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం జరిగిందన్నారు. ఈ బహిరంగ సభ, ప్రజా ప్రదర్శనలో ఆల్ ఇండియా నాయకులు, రాష్ట్ర నాయకులు పాల్గొనున్నారన్నారు. ఈ సభల్లో రాష్ట్రంలో, జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి వాటిపై తీర్మానాలు చేస్తామన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని ప్రధాన నినాదంగా ఈ మహాసభలో పిలుపునిస్తామన్నారు. పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు అమ్మకం ఆపాలని ఈ మహాసభ ద్వారా నినదిస్తామని తెలిపారు. జిల్లాలోని కాలుష్యం, రోడ్లు, శ్మశానాలు, డంపింగ్ యార్డుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సందర్భంగా చించినాడ బ్రిడ్జికి, విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని కోరుతున్నామన్నారు. భీమవరం పాత బస్టాండ్‌లో ఉన్న పాత అల్లూరి సీతారామరాజు స్మారక భవనం స్థానంలో నాలుగు అంతస్తుల కొత్త భవనాన్ని నిర్మించి దాన్ని సాంస్కృతిక కళాకేంద్రంగా, సేవా కేంద్రంగా తీర్చి దిద్దాలన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచొద్దు, రైతుల మోటార్లకు మీటర్లు బిగించొద్దు, ఇసుక సమస్యలను పరిస్కరించాలని కోరడం జరుగుతుందన్నారు. మహాసభలను జయప్రదం చేయడానికి ప్రజలందరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు పాల్గొన్నారు.

ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు : సిపిఎం

జిల్లా ప్రజానీకానికి సిపిఎం జిల్లా కమిటీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది. నూతన సంవత్సరంలో ప్రజల సమస్యలు పరిష్కారం కావాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, విద్య, వైద్యం ప్రజలందరికీ అందుబాటులోకి రావాలని, విద్యార్థులు, యువకులు, మహిళలపై అత్యాచారాలు ఆగాలని కోరుకుంటున్నామని తెలిపింది.

ప్రతిభా పాటవాల్లో వికలాంగులు ముందంజ

ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వికలాంగులు సకలాంగుల కంటే ప్రతిభా పాటవాల్లో ముందుంటారని, అన్ని రంగాల్లో ముందు ఉండడం అభినందనీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. రాష్ట్ర డెఫ్ అండ్ డమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో జరిగే రాష్ట్రస్థాయి డెఫ్ అండ్ డమ్ (మూగ, చెవుడు) పోటీల పోస్టర్‌ను ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎంఎల్‌ఎ అంజిబాబు ఆవిష్కరించి మాట్లాడారు. అసోసియేషన్ నిర్వహించే పోటీలకు తమ సహకారం ఉంటుందన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 2025 ఫిబ్రవరి నెలలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ విషయంపై ఎంఎల్‌ఎ అంజిబాబుతో చర్చించామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.తాతారావు, గనిశెట్టి సత్యశివ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో పశ్చిమ ముందడుగు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

జిల్లా కలెక్టర్‌గా తాను బాధ్యతలు చేపట్టి ఆరు నెలలు గడుస్తోందని, ఈ కాలంలో పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధిలో ముందడుగు వేసిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ మరింత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్లో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లుతో కలిసి కలెక్టర్ నాగరాణి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా వైద్య శాఖ ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ డిజిటలైజేషన్ అమల్లో అత్యుత్తమ సహకారం అందించినందుకు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ మిషన్ ఉత్తమ పనితీరుగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఏరియా ఆసుపత్రి తాడేపల్లిగూడెం 2023-24 సంవత్సరానికి పారిశుధ్యం, పరిశుభ్రతకు కాయకల్ప అవార్డులకు రాష్ట్రస్థాయి పోటీలో మొదటి బహుమతిని రూ.10 లక్షల ప్రైజ్ మనీ సాధించిందన్నారు. రాష్ట్రం అందుకున్న 11 అవార్డుల్లో జిల్లా ఉత్తమ ఎహెచ్, ఉత్తమ పిహెచ్‌సి, ఉత్తమ హెచ్‌డబ్ల్యూసి, 3 విభాగాల్లో 5 అవార్డులు అందుకుందన్నారు. ఉద్యానవన రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద రూ.12 లక్షలతో 24 హెక్టార్లలో హైబ్రిడ్ కూరగాయల సాగును ప్రోత్సహించినట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ కొత్త ప్లాంటేషన్ 84 హెక్టార్లలో రూ.23.34 లక్షలతో నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ - ఆయిల్ పామ్ కింద చేపట్టామన్నారు. పశుసంవర్ధక శాఖ ఐవిఎఫ్ టెక్నాలజీ ద్వారా జిల్లాలో మొదటి దేశీయ ఆడ ఒంగోలు జాతి దూడ జన్మించిందని, ఒంగోలు, షాహివాల్, గిర్, పుంగనూరు జాతులకు చెందిన పిండాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని 1,430 పాఠశాలల్లో 67,415 మంది తల్లిదండ్రులు, 11,653 మంది ప్రజల భాగస్వామ్యంతో మెగా పేరెంట్ టీచర్ సమావేశాలు నిర్వహించామన్నారు. జిల్లా పనితీరు రేటింగ్స్‌లో 2వ ర్యాంకును రాష్ట్రంలో అభ్యాసనా ఫలితాల్లో 5వ ర్యాంకును పొందిందన్నారు. జిల్లా స్వచ్ఛత హి సేవా అవార్డులు - 2024 కింద రాష్ట్రంలో ఉత్తమ జిల్లా అవార్డు - స్వచ్ఛ లక్షిత్ ఏకాయి (పరిశుభ్రత లక్ష్య యూనిట్లు) - 2024లో పొందిందన్నారు. జిల్లాలో 35 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయని, వాటిలో 8 హాస్టళ్లకు మరమ్మతులు, మౌలిక సదుపాయాలను మెరుగుపర్చామన్నారు. మిగిలిన హాస్టళ్ల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం రూ.129.38 లక్షలు కేటాయించిందని, ఈ హాస్టళ్ల మరమ్మతు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. తాడేపల్లిగూడెం నిట్‌లో రూ.3.86 కోట్ల అంచనా వ్యయంతో 5 ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌తో కూడిన 33/11 కెవి సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి వినియోగంలోకి తెచ్చామన్నారు. ఉపాధి హామీ నిధులతో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి ఇప్పటి వరకూ 355 సీసీ రోడ్లు మంజూరు చేశామన్నారు. 305 పనులు పురోగతిలో ఉన్నాయని 10 రోడ్లు పూర్తయ్యాయని తెలిపారు. జిల్లా కలెక్టర్‌గా ఐఎఎస్ జిబిని అందుకుని, నవంబర్ 25న న్యూఢిల్లీలో కేంద్ర జౌళి శాఖ మంత్రి, భారత ప్రభుత్వంచే నరసాపురం లేస్ పార్క్ కోసం సర్టిఫికెట్ అందుకున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సుల ద్వారా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు సంబంధించి ప్రజా ఫిర్యాదులను ఈ జిల్లాలో రెవెన్యూ సదస్సులో పూర్తి స్థాయిలో ప్రజలు సంతృప్తి పరిచేలా పరిష్కరిస్తున్నామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికుల వినతి

ప్రజాశక్తి - పెనుగొండ



వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా మంగళవారం పెనుగొండ గ్రామ పంచాయతీ కార్యనిర్వహణాధికారి రత్నాకరరావుకు కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికురాలు, నాయకురాలు బంగారు విజయ మాట్లాడుతూ కార్మికులకు సంక్షేమ పథకాల ద్వారా రావాల్సిన సంవత్సరానికి రెండు జతల దుస్తులు, చెప్పులు నేటికీ అందజేయకపోవడం అన్యాయమన్నారు. పారిశుధ్య పనిచేయడానికి అవసరమైన చీపుర్లు, పారలు కార్మికులకు అరకొరగా అందజేయడం వల్ల కార్మికులే కొనుగోలు చేసుకుని పనులు నిర్వహించాల్సి వస్తోందన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ వంటి సంక్షేమ పథకాల అమల్లో ప్రభుత్వం ఎటువంటి శ్రద్ధ కనబర్చడం లేదన్నారు. కార్మికుల సమస్యల పట్ల యాజమాన్యం చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బంగారు మరియమ్మ, నీలాపు గంగ, సువర్ణకుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - గణపవరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. మంగళవారం గణపవరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మెదూరి వెంకట సూర్యనారాయణ మూర్తి ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక హైస్కూల్లో జరిగిన సన్మాన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సభకు నాగ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడికి ప్రాధాన్యతివ్వడం లేదని, గుడికి ప్రాధాన్యతిస్తూ విద్యారంగాన్ని వదిలించుకోవడానికి చూస్తోందని తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ సమయంలో కంట నీరు పెట్టుకునే పరిస్థితి కలిగిందన్నారు. కేరళ, గుజరాత్, త్రిపుర, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో 80 శాతం విద్యాభివృద్ధి అవుతుంటే కార్పొరేట్ స్థాయి పాఠశాలలకు వంతపాడుతున్న ప్రభుత్వాలు కళ్లుమూసుకున్నాయని విమర్శించారు. ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేయడం మానుకొని ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన మూర్తి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గణపవరం, నిడమర్రు మండలాల ఉపాధ్యాయులు గణపవరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి, కన్యకాపరమేశ్వరి వర్తక సంఘం బవనం అధ్యక్షులు ఆర్‌విఎస్.రాజు, యుటిఎఫ్ మండల నాయకులు రమేష్, భవానీ ప్రసాద్, శర్మ, నాగ సత్యనారాయణ, జె.నాని పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని ధర్నా

ప్రజాశక్తి - ఆకివీడు



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రివర్గం నుంచి భర్త రఫ్ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కె.తవిటి నాయుడు డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం సాయంత్రం ధర్నా చేసి కొద్దిసేపు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నేత బి.రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తవిటినాయుడు మాట్లాడుతూ అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేసినా మోడీ అమిత్‌షాను వెనక వేసుకురావడం దుర్మార్గమన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అడుగుజాడల్లో రాష్ట్రాన్ని తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ అంశంపై పవన్ కళ్యాణ్, చంద్రబాబు మాట్లాడకపోవడం అంబేద్కర్‌ను అవమానించడమేనని తెలిపారు. రాజ్యాంగం పట్ల గౌరవం ఉంటే మోడీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో పెంకి అప్పారావు, ఎస్‌కె.బాజీ, గేదెల ధనుష్, నెల్లి సూరిబాబు, పంపల వెంకటరమణ, నెల్లి సూరిబాబు పాల్గొన్నారు.

గతేడాది కంటే నేరాలు తగ్గాయి

గంజాయి నియంత్రణకు ప్రత్యేక చర్యలు

మహిళా రక్షక టీములు

జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గతేడాది కంటే 2024 ఈ ఏడాది జిల్లాలో నేరాలను సమిష్టి కృషితో తగ్గించగలిగామని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 2024లో జరిగిన నేరాల వివరాలను ఆయన మీడియాకు వివరించారు. నేరాలు తగ్గడానికి ముఖ్యకారణం జిల్లా పోలీస్ శాఖ తీసుకున్న నిర్ణయాలు, అవలంబించిన విధానాలు సత్ఫలితాలు అందించాలని నిర్వహించిన లోక్ అదాలత్ వద్ద అత్యధిక కేసులు రాజీ చేయడంలో రాష్ట్రంలోనే జిల్లాకు సముచిత స్థానం దక్కిందన్నారు. ముఖ్యంగా జిల్లాలో రౌడీ షీటర్లపై నిఘా పెట్టడమే కాకుండా, వారికి ప్రత్యేకంగా కౌన్సిలింగ్ కూడా ఇవ్వడం జరుగుతోందన్నారు. జిల్లాలోకి అసాంఘిక శక్తులు ప్రవేశించకుండా సముద్రతీరం వెంబడి నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నామని తెలిపారు. నేటి కాలంలో పెరుగుతున్న వైట్ కలర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. మహిళలు, చిన్నారుల రక్షణకు మహిళా రక్షక్ టీమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి పోలీస్ బస్టాండ్, రైల్వేస్టేషన్, పాఠశాలలు, కళాశాలలు, దేవాలయాల ప్రాంతంలో ర్యాగింగ్ నిరోధానికి పోలీసు వాహనాలు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2023లో మొత్తం 6,022 కేసులు నమోదవ్వగా, 2024లో 6,173 కేసులు నమోదయ్యాయన్నారు. 2023లో 17 హత్య కేసులు నమోదు కాగా 2024లో 15 కేసులు నమోదయ్యాయన్నారు. ఆస్తికోసం హత్య 2023లో ఒక కేసుక కాగా 24లో మూడు కేసులు నమోదయ్యాయన్నారు. 2023లో నాలుగు దోపిడీ కేసులు నమోదు కాగా 24లో 14 కేసు నమోదయ్యాయని తెలిపారు. దొంగతనాల కేసులు 2023లో 483 నమోదు కాగా 24లో 473 నమోదయ్యాయని తెలిపారు. మహిళల కేసులు 2023లో 997 నమోదు కాగా 2024లో 768 కేసులు నమోదయ్యాయని తెలిపారు. పోక్సో కేసులు 2023లో 91 నమోదు కాగా 24లో 93 కేసులు నమోదైనట్లు తెలిపారు. మద్యం అక్రమ రవాణా 337 కేసులు నమోదు కాగా 349 మందిని అరెస్ట్ చేసి 1319.935 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. బియ్యం అక్రమ రవాణా 24 కేసులో 45 ముద్దాయిలను అరెస్ట్ చేసి 52,652 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సైబర్ నేరాలు ఫిర్యాదులకు 1930 టోల్ ఫ్రీ నంబరు కల్పించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్‌పి భీమారావు, భీమవరం డిఎస్‌పి జై.సూర్య, నరసాపురం డిఎస్‌పి వేద, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పుల్లారావు పాల్గొన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

ఈ నెల 5, 6, 7 తేదీల్లో కాకినాడలో జరగబోయే యుటిఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభను జయప్రదం చేయాలని యుటిఎఫ్ మాజీ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం.మార్కండేయులు అన్నారు. మంగళవారం యుటిఎఫ్ భవనం వద్ద యుటిఎఫ్ పతాకాన్ని ఎం.మార్కండేయ, సీనియర్ నాయకులు విశ్రాంత ఉపాధ్యాయులు వై.స్వామినాయుడు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి.విజయరామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రాంభద్రం, జిల్లా గౌరవాధ్యక్షులు ఉపాధ్యక్షులు, కె.రాజశేఖర్, సిహెచ్.పట్టాభిరాం, జిల్లా కోశాధికారి పి.క్రాంతికుమార్, జిల్లా కార్యదర్శులు, నరసాపురం రూరల్ ప్రధాన కార్యదర్శి ఎస్.అజయకుమార్, నరసాపురం పట్టణాధ్యక్షులు కె.మాణిక్యాలరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

తణుకు రూరల్ : చిన్ననాటి నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తణుకు బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది కొరు వెంకటేశ్వర్లు అన్నారు. న్యాయ సేవా సంస్థ ఛైర్మన్, నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో మంగళవారం నిర్వహించిన చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిషేధంలో ఉన్న మాదకద్రవ్యాలు వినియోగించడం చట్టరీత్యా నేరమన్నారు. దీనిలో భాగంగా పిల్లలు చట్టాలపై అవగాహన కలిగించేలా ర్యాగింగ్ చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల నిరోధక చట్టం, ఈవ్ టీజింగ్ చట్టం, ఉచిత న్యాయ సహాయం అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్ మిస్ట్రెస్ టి.వరలక్ష్మి, మండల న్యాయ సేవల కమిటీ ప్యానెల్ న్యాయవాది ఎ.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కృషి అభినందనీయం

విలువల బడి వ్యవస్థాపకులు లెనిన్ బాబు

కాళ్ల : పాఠశాల విద్యార్థుల్లో సమగ్ర మనోవికాసానికి పలువురు ఉపాధ్యాయులు తమవంతుగా కృషిచేయడం అభినందనీయమని విలువలబడి వ్యవస్థాపకులు లెనిన్ బాబు పేర్కొన్నారు. కోపల్లె గ్రామంలో ఎస్ఎమ్‌డిఆర్‌ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి సమగ్ర వికాస శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. విలువలబడి వ్యవస్థాపకులు లెనిన్ బాబు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు అనేక విషయాలపై అవగాహన కల్పించారు. చక్కని పాటలతో విద్యార్థులకు అవసరమైన ఎన్నో విషయాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.నిర్మలాదేవి మంచి కార్యక్రమం నిర్వహించినందుకుగాను లెనిన్ బాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు వందేమాతరం ఫౌండేషన్ అశోక్, ఐక్య నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వైస్.ఆర్, కస్తూరి స్వామినాయుడు, ఫస్ట్ అసిస్టెంట్ కె.సుబ్బరాజు, స్టాఫ్ సెక్రెటరీ ఎస్.మాణిక్యాలరావు, మ్యూజిక్ టీచర్ పాల్గొన్నారు.

మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు

ఆకివీడు : విద్యార్థుల అభివృద్ధి కోసం అవసరమైన అన్ని రకాల పనులు చేపడతామని శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు చెప్పారు. మంగళవారం ఆయన స్వగ్రామం అయిభీమవరంలో జిల్లా పరిషత్ హై స్కూల్లో నూతనంగా నిర్మించిన ఆట స్థలాల ప్రత్యేక క్రీడా ప్రాంగణాలు ఆయన ప్రారంభించారు. ఈ పాఠశాలకు సంబంధించి మరిన్ని కార్యక్రమాలు త్వరలో చేపడతామన్నారు. అనంతరం గ్రామంలో అలనాడు ఆయన ఎంపీగా ఉన్న కాలంనాటి నిధులతో రెండు నెలల క్రితం శంకుస్థాపన చేసిన పనులకు నేడు ఉపసభాపతిగా వాటిని ప్రారంభించారు. రూ.45 లక్షలతో నిర్మించిన రెండు రోడ్లు, ఉపాధి నిధులతో నిర్మించిన మరో రోడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం ఆ పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణ రాజు సహకారంతో పేదలకు దుప్పట్లు, బట్టలు పంపిణీ చేశారు.

పింఛన్‌దారులు వెనక్కి..

రెవెన్యూ సదస్సులో అధికారుల తీరుపై విమర్శలు

ఉండి : రెవెన్యూ సదస్సులో లభించే సేవలపై అధికారుల నోట పూటకోమాట వినిపిస్తుందని పలువురు విమర్శిస్తున్నారు. మంగళవారం ఉండి మండలం చిలుకూరు గ్రామంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో వితంతు పింఛన్లు ఇప్పించాలని వచ్చిన వారిని ఇవి కేవలం రైతులకు సంబంధించిన సదస్సులు మాత్రమే అని అధికారులు వెనక్కి పంపించడం పట్ల పలువురు విమర్శలు చేస్తున్నారు. మహదేవపట్నం గ్రామంలో నిర్వహించిన సదస్సులో అధికారులు ఈ సదస్సులు కేవలం భూ సమస్యలకే పరిమితం కాదని, ఈ సదస్సులో రేషన్ కార్డులు, పింఛన్లు ప్రభుత్వపరంగా వచ్చే ఎటువంటి అంశాలకు సంబంధించిన ఫిర్యాదులైనా ఈ సదస్సులో స్వీకరిస్తామని చెప్పినప్పటికీ గ్రామ స్థాయి అధికారులు పింఛన్ల గురించి ఫిర్యాదు చేసిన వారిని వెనక్కి పంపించడంతో తీవ్ర విమర్శలకు గురి చేస్తున్నది. ఇకనైనా మండల స్థాయి అధికారులు రెవెన్యూ సదస్సు ముగిసే వరకు సదస్సుల్లోనే ఉంటే అర్జీలకు న్యాయం జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కొత్త కనకరత్నమాలకు అవార్డు

ఆచంట : భీమలాపురం గ్రామానికి చెందిన వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు, 201 డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కొత్త కనకరత్నమాల వెంకటేశ్వర్లు ఎక్సలెంట్ సర్వీస్ లేడీ 2024 సుంకర ఇంద్రజిత్ మెమోరియల్ అవార్డును ఏలూరు కన్వెన్షన్‌లో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ చేతిలో సీతారామయ్య చేతుల మీదుగా అందుకున్నట్లు ఆమె మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ నేతలు కృష్ణకుమారి, మురళీ మోహన్ ఉన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణం పరిశీలన

ఉండి : మండలంలోని చిలుకూరు గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డును చిలుకూరు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు వేగేశ్న వెంకట సత్యనారాయణ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలోని వివిధ కాలనీలలో ప్రజలు వర్షాకాలంలో వర్షపు నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నారని ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్ల నిర్మాణానికి అధికారులను ఆదేశించారు. ఈమేరకు 135 మీటర్ల రహదారిని రూ.10 లక్షల వ్యయంతో నాణ్యతతో నిర్మించారని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణానికి సహకరించిన ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజుకు తమ గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయనతోపాటు నంబూరి వెంకటరాజు, భీమరాజు ఉన్నారు.

గ్రామాల్లో చెత్త నివారించాలి : ఎంఎల్ఎ

నరసాపురం : సంక్రాంతి పండుగకు నియోజకవర్గానికి ఇతర రాష్ట్రాలు, దేశాలు, జిల్లాల నుంచి బంధుమిత్రులకు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలుకుదామని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. మైలాబత్తుల సోని అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సమావేశం నిర్వహించారు. తొలుతగా ఇటీవల మృతి చెందిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సమావేశానికి నాయకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంక్రాంతి సందర్భంగా పట్టణంతో పాటు గ్రామాల్లో చెత్త కనపడకుండా పూర్తి స్థాయిలో పారిశుధ్య పనులు ఇప్పటి నుంచే చేపట్టాలన్నారు. రాష్ట్ర, జాతీయ రహదారుల వెంబడి ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలు నిలుపుదల చేయకుండా, చర్యలు చేయకుండా చూడటంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా రెవెన్యూ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా నాయకర్, వంక రవీంద్ర న్యూ ఇయర్ సందర్భంగా కేకును కోసి అందరికీ పంచారు. జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్, తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

భూ యజమానులకు భూ రక్షణ చట్టం తీసుకొచ్చాం

మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

పెనుమంట్ర : ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేసి భూ యజమానులకు రక్షణ చట్టాన్ని తెచ్చింది కూటమి ప్రభుత్వమని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని మల్లిపూడి, ఎస్.ఇల్లింద్రపర్రులో రెవెన్యూ సదస్సులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని ప్రజా సమస్యలే వేదికగా పరిష్కరించే ప్రభుత్వమని అన్నారు. గత ప్రభుత్వం భూ హక్కు చట్టాన్ని వాడుకుని, రైతాంగానికి భూమిపై హక్కు లేకుండా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని అన్నారు. రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన ఫిర్యాదులను 60 రోజుల్లో పరిష్కరించి లిఖితపూర్వకంగా భూ హక్కుదారునికి రెవెన్యూ శాఖ పరిష్కరించి రైతులకు ఇస్తుందని చెప్పారు. మల్లిపూడి సర్పంచి దొంగ మహాలక్ష్మి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బెల్టు షాపు నిర్వాహకుని అరెస్ట్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మంగళవారం వేర్వేరు ప్రదేశాలలో దాడులు నిర్వహించి, ఒక కేసు నమోదు చేసి ముద్దాయిను అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్య లక్ష్మి ఓ ప్రకటన విడుదల చేశారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది కలిసి అత్తిలి మండలం లక్ష్మీనారాయణపురం గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 24 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనపరుచుకుని అదుపులోని తీసుకున్నట్టు తెలిపారు.

కొత్త సంవత్సరానికి ఆఫర్ల సందడి

కాంబో ఆఫర్లతో బిర్యానీ మేళాలు
ముగ్గుల కోసం రంగులు.. పిల్లల కోసం గ్రీటింగ్స్..

ప్రజాశక్తి - పెనుమంట్ర

జిల్లాలో నాన్‌వెజ్ వంటలకు ముఖ్యంగా చికెన్ పకోడీకి ప్రసిద్ధి చెందిన మండలంలోని



రద్దీగా ఉన్న మొగల్తూరు మార్కెట్

మార్టేరులో 2024కు వీడ్కోలు చెప్పి, 2025కు స్వాగతం పలుకుతూ మంగళవారం ఉదయం నుంచే పలు చోట్ల నాన్ వెజ్ బిర్యానీ మేళాలతో ముస్తాబు అవుతోంది. రకరకాల కాంబో ఆఫర్లతో చికెన్, మటన్, రొయ్య, పీత, పిట్ట బిర్యానీ కాంబోలు తక్కువలో రూ.399 నుంచి ఎక్కువలో ఎక్కువ రూ.749 వరకు ఉండటం విశేషం. వీటన్నిటికీ ఒక కూల్ డ్రింక్ ఫ్రీ ఇవ్వడం ప్రత్యేకం. కాగా అప్పటికప్పుడు 31 సాయంత్రం నుంచి ప్రతీ క్యాంటీన్, కాకా హోటల్స్ వారు రూ.49, రూ.69, రూ.99లకే బాసుమతి బియ్యంతో చికెన్ బిర్యానీ ఆఫర్స్ ఇస్తూ తిండి ప్రియుల్ని ఆకర్షిస్తూ ఆహ్వానిస్తున్నారు. ఈరోజు చాలా మంది ప్రభుత్వ పెన్షన్లు అందుకోవడం వల్ల తమ అమ్మకాలు బాగుంటాయని విక్రయదారులు ఉత్సాహంగా ఉన్నారు. ఇదిలా ఉండగా అక్కడక్కడా 31 రాత్రి అమ్మాయిలు గుమ్మాల్లో వేసే పెద్ద పెద్ద ముగ్గుల కోసం రకరకాల రంగుల పొడులు అమ్మే దుకాణాలు వెలిశాయి. స్కూల్ పిల్లలు ఉత్సాహంగా ఇచ్చి పుచ్చుకొనే న్యూ ఇయర్ గ్రీటింగ్స్ దుకాణాలు దాదాపు ప్రతీ ఫ్యాన్సీ స్టోర్స్ వద్ద ఏర్పాటు అయ్యాయి.

పూలదండలు, స్వీట్లకు గిరాకీ

ఆచంట : కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం పలికేందుకు ఆచంట మండల ప్రజలు షాపింగ్‌లో బిజీబిజీ అయ్యారు. దీంతో మార్కెట్లో పూలబొకేలు, పూలదండలు, కేకులు, స్వీట్లు, పండ్లకు గిరాకీ పెరిగింది. మరి కొద్ది గంటల్లో 2025వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో మార్కెట్లన్నీ కళకళలాడుతున్నాయి. వస్త్ర దుకాణాలు, గిఫ్ట్ షాపుల్లో సందడి నెలకొంది. ఇక బిర్యానీ సెంటర్లైతే ఒకటి కొంటే మరొకటి ఫ్రీ అంటూ ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలు, ప్రార్థనల కోసం మండలంలోని దేవాలయాలు, చర్చిలు ముస్తాబయ్యాయి.

మార్కెట్లో రంగవల్లుల సందడి..

కాళ్ల : డిసెంబర్ 31న ప్రతి గ్రామంలో రంగుల విక్రయాలు మంగళవారం నిర్వహించారు. న్యూ ఇయర్ ప్రారంభం నుంచి సంక్రాంతి వరకూ రంగవల్లుల సందడి కనిపిస్తోంది. మహిళలు ఇంటి ముందు రంగురంగుల ముగ్గులతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతుంటారు. వ్యాపారులు దాదాపు 50 రకాలు పైబడి రంగులను అందుబాటులో ఉంచారు. రంగులతోపాటు వాటిలో కలిపేందుకు చెమికలు, కొన్ని రకాల ఫ్యాన్సీ డిజైన్స్ కూడా ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. రంగులు పేపర్లలో పొట్లాలు కట్టే పద్ధతిలో విక్రయాలు సాగుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో వివిధ రకాల రంగులు కవర్లలో కేజీల చొప్పున విక్రయిస్తున్నారు. కొత్త సంవత్సరం రోజున ఎవరినైనా కలవాలంటే పూలు కొనుగోలు చేసి ఇవ్వడం సాంప్రదాయం. దీనిలో భాగంగా న్యూ ఇయర్ వేడుకలకు పండ్లు, పూల వ్యాపారులు అధిక సంఖ్యలో దిగుమతి చేసుకుని విక్రయాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. యాపిల్, దానిమ్మ, కమలాలను ఎక్కువగా మార్కెట్లో పెద్ద సైజులో ఉన్న వాటిని విక్రయిస్తున్నారు. పూల బొకేలు దిగుమతి చేసుకుని డిసెంబర్ 31, ఈనెల 1న విక్రయించేందుకు వ్యాపారులు సిద్ధమవుతున్నారు.



కాళ్ల: ఏలూరుపాడులో రంగులను విక్రయిస్తున్న వ్యాపారి

రద్దీగా గాంధీ బొమ్మ సెంటర్

మొగల్తూరు : మండల కేంద్రం మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతం మంగళవారం సాయంత్రం రద్దీగా మారింది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో పూలు, పళ్లు, పలావ్, రంగుల దుకాణాలు వెలిశాయి. దీంతో మార్కెట్ ప్రాంతం ఆయా దుకాణాలకు కొనుగోలుదారులతో కిటకిటలాడింది.

ఇంటింటికీ సామాజిక పింఛన్ల పంపిణీ



తాడేపల్లిగూడెంలో పింఛన్ అందజేస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

టిడిపి అధికారంలోకి వస్తే ఇంటింటికీ పెన్షన్ వెళ్లదని తప్పుడు ప్రచారం చేశారని, సోమవారం ఉదయం 6 గంటల నుంచి జనవరిలో ఇవ్వవలసిన పెన్షన్ ఒక రోజు ముందుగానే 98 శాతం పంపిణీ చేసినట్లు ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన పెన్షన్లు అందజేస్తామని, పార్టీలకు అతీతంగా ఏ పార్టీకి పనిచేసినా సరే కూటమి ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందజేసే కార్యక్రమంలో నిమగ్నమై ఉంటామని తెలిపారు. ఎన్‌డియే కూటమి నాయకులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్ సొమ్మును పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో రూ.15 కోట్ల 29 లక్షల సొమ్మును 34,848 మంది లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు ఎంఎల్ఎ తెలిపారు. అనంతరం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో నూతన పెన్షన్‌దారులకు కూటమి నాయకులతో కలిపి పెన్షన్ సొమ్మును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, వర్తనపల్లి కాశి, కిలపర్తి వెంకట్రావు, పాలూరి వెంకటేశ్వరరావు, నరిసే సోమేశ్వరరావు పాల్గొన్నారు.

మొగల్తూరు : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ చేపట్టిందని ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాని తెలిపారు. మండలంలోని గ్రామాల్లో ఉన్న పెన్షన్ లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామాల్లో ఉన్న 10,555 మంది లబ్ధిదారులకు 10,095 మందికి 96 శాతం పెన్షన్లు పంపిణీ చేసామని ఆయన తెలిపారు. మిగిలిన వారికి కూడా అందజేసిన నూరుశాతం పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మేడిది నవీన్ కిరణ్, సిబ్బంది ఉన్నారు.



మొగల్తూరు : లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎంపిడిఒ

సిపిఎం సానుభూతిపరుడు ప్రసాద్ మృతి

ప్రజాశక్తి - పెనుగొండ



సిపిఎం సీనియర్ సభ్యులు, కౌలు రైతు గుండెపోటుతో ఆకస్మిక మరణం చెందారు. దేవ గ్రామానికి చెందిన మన్నె ప్రసాద్(58) పార్టీ పట్ల అంకితభావంతో ఉండేవారని పలువురు తెలిపారు. పార్టీ అంటే అంచలంచెల విశ్వాసంతో పనిచేసే ఆయనకు సిపిఎం పెనుగొండ మండల కమిటీ జోహార్లు అర్పించింది. సిపిఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా ఆయన మృతదేహాన్ని సందర్శించి, ఘన నివాళులర్పించారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని అన్నారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం నాయకులు చిలుకూరి శ్రీనివాస్ పూలదండ వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అందుబాటులోకి జూనియర్ కళాశాలలు

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు

ఉండి : ఉండి హైస్కూల్లో 2022 సంవత్సరం నుంచి బాలికలకు జూనియర్ కళాశాలను ప్రారంభించినప్పటికీ దానిని వారు సద్వినియోగం చేసుకోకపోవడంతో వచ్చే సంవత్సరం నుంచి బాలబాలికలకు జూనియర్ కళాశాల ఉండే విధంగా కావలసిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని ఉండి ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. జూనియర్ కళాశాలలో తక్కువ శాతం విద్యార్థులు ఉన్న కళాశాలలను తొలగించి ఉన్నత పాఠశాలగానే ఉంచుతామని, ఇందులో చదివే విద్యార్థులను సమీపంలోని జూనియర్ కళాశాలలో కలుపుతామని ఇటీవల ఒక పత్రికలో వచ్చిందని మంగళవారం మధ్యాహ్నం ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఎంఎల్ఎ దృష్టికి పాఠశాల ఉపాధ్యాయులు తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన మాట్లాడుతూ వచ్చే సంవత్సరానికి అన్ని రకాలుగా ఉన్నత పాఠశాలను, జూనియర్ కళాశాలను తీర్చిదిద్ది జూనియర్ కళాశాలలో బాలబాలికలకు విద్యను అందించేందుకు కృషిచేస్తామని ఆయన తెలిపారు. ఆయనతోపాటు ఆర్‌డిఒ టి.ప్రవీణ్ కుమార్ రెడ్డి, డిఇఒ ఇ.నారాయణ, పార్టీ మండల అధ్యక్షులు కె.నాగరాజు, నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు మంతెన సాయి లచ్చిరాజు, టిడిపి గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి, నాయకులు పొత్తూరి వెంకటేశ్వరరాజు, ముదునూరి కృష్ణంరాజు, తోట శ్రీరాములు, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, మజ్జి కృష్ణ ప్రసాద్, కర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాగునీరు, శానిటేషన్‌పై దృష్టి పెట్టాలి

కౌన్సిల్ సమావేశంలో ఎంఎల్ఎ నాయకర్

నరసాపురం : నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కౌన్సిల్ సమావేశం ఛైర్‌పర్సన్ వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం ప్రారంభం నుంచి సమావేశం రసాభాసగా సాగింది. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. నాయకర్ సమక్షంలోనే జనసేన, వైసిపి సభ్యులు వాగ్వాదానికి దిగారు. కౌన్సిల్ సభ్యులకు తెలియకుండా నోటీస్ తీసుకురాకుండా అజెండాలో అంశంలు తీసుకురావడంపై అన్ని పార్టీల సభ్యులు మున్సిపల్ అధికారుల తీరుపై ఫైర్ అయ్యారు. దీంతో ఆది నుంచి చివరి వరకు సమావేశం గందరగోళంగా సాగింది. ముందుగా బడ్జెట్‌ను ఆర్ఐ నానాజీ ప్రవేశపెట్టారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మిగులు బడ్జెట్ రూ.4,23,74,812 కోట్లుగా చూపించారు. ప్రవేశపెట్టిన కొద్ది సేపటికే వీసీ కొత్తపల్లి నాని మాట్లాడుతూ మున్సిపల్ స్కూళ్లకు సంబంధించిన అంశాలను తమకు చెప్పకుండా అజెండాలో ఎందుకు పొందపర్చారంటూ నిలదీశారు. ఈయనకు మద్దతుగా వైసిపి సభ్యులు కేసరి గంగరాజు, వైకెఎస్ తదితరులు ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ అంజయ్య సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. వీరికి జనసేన కౌన్సిలర్లు సూర్యకుమారి, కృష్ణవేణి, అరుణకుమారి, సురేష్‌లు పట్టుబట్టారు. ఈ అంశాలను వాయిదా వేయాలని కోరారు. చివరికి విప్ నాయకర్ జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వన్నెంరెడ్డి శ్రీనివాస్, ఏటిగట్టు అభివృద్ధి పనులు పూర్తి చేయించాలని మల్లాడి వేషవేణి, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని వైస్ ఛైర్మన్ కొత్తపల్లి నాని, మున్సిపల్ కార్యాలయం వద్ద తడి, పొడి చెత్తను వేరుచేసే యూనిట్ తాత్కాలికంగా ఏర్పాటు చేయడం తగదని వైస్ ఛైర్‌పర్సన్ ప్రశ్నించారు. అనంతరం నాయకర్ మాట్లాడుతూ పండగ సమయంలో వీధిలైట్లు, తాగునీరు, సానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ఎంఎల్ఎ నాయకర్, ఛైర్‌పర్సన్ వెంకటరమణ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధాన కర్తలు

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఆకివీడు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ

పత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానకర్తలని రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. మంగళవారం మండలంలోని అయిభీమవరం గ్రామంలో ఆయన స్వగృహం వద్ద 2025 ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రిక క్యాలెండర్‌ను అభినందించారు. క్యాలెండర్‌లో ఉన్న చిత్రాలు ప్రతిఒక్కరూ విడివిడిగా గమనించాలన్నారు. వాటిలో ఉన్న సారాంశాన్ని స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కనుమూరు అబ్బాయి రాజు, జనసేన నాయకురాలు వరలక్ష్మి, గ్రామ మాజీ సర్పంచి కనుమూరు రామకృష్ణంరాజు, గ్రామ ప్రముఖులు అప్పలరాజు, బిజెపి నాయకురాలు ముసునూరు నాగమణి, ఆర్‌డిఒ పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - కాళ్ల



కోపల్లె క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న నిరీక్షణ రాజు

యేసు ప్రభువు ఆదర్శాలను గౌరవించడానికి క్రిస్మస్ సంతోషకరమైన సందర్భమని ఆకివీడు జీవన ప్రార్థన పరిచర్య పాస్టర్ జ్ఞాన్ ప్రకాష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కోపల్లె గ్రామంలో టిడిపి నాయకులు డి.నిరీక్షణ రాజు-శిరీష ఇంటి వద్ద 9వ వార్షిక క్రిస్మస్ వేడుకలను ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఈ వేడుకలకు రెవ జి.ప్రకాష్ సభాధ్యక్షత వహించారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని ఇంటిపై విద్యుద్దీపాలతో అలంకరించారు. యేసు ప్రభువును స్మరించుకొని ప్రార్థనలు చేశారు. సంఘ సిఆర్.మాణిక్యాలరావు మాట్లాడుతూ ఏసు జన్మ గొప్పతనాన్ని వివరించారు. ప్రపంచ శాంతి కోసం దైవదూత ఏసుక్రీస్తు జన్మించాడని తెలిపారు. క్రిస్మస్ వేడుకలకు వచ్చిన విశ్వాసులకు ప్రేమ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి బూడి వెంకట పద్రాలు, పాస్టర్ డేవిడ్ రాజు, ప్రభు కుమార్, మోషే రాజు, కుమార్ రత్నం పాల్గొన్నారు.

పలుచోట్ల నూతన సంవత్సర వేడుకలు



నరసాపురంలో..

ప్రజాశక్తి - నరసాపురం

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతి రాజ రామ్మోహన్ నాయుడు నివాసంలో 2024 సంవత్సరానికి ముగింపు పలుకుతూ కొత్త సంవత్సరం 2025కు ఆహ్వానం పలుకుతూ, క్రిస్మస్ శుభాకాంక్షలు చెబుతూ కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా ఆర్‌డిఒ దాసిరాజు పాల్గొన్నారు. రామ్మోహన్ నాయుడు ఆర్‌డిఒ దాసిరాజుని సాదరంగా ఆహ్వానించి ఆయన పట్ల తనకున్న అభిమానాన్ని చాటారు. ఈ సందర్భంగా కొవ్వలి అభిమానులు ఆర్‌డిఒ దాసిరాజుకు క్రిస్మస్, నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన..

పాలకొల్లు : నూతన సంవత్సరాన్ని ఒక అవకాశంగా తీసుకుని సరికొత్త ఆలోచనలతో అందరూ ముందుకు సాగాలని వాకర్స్ క్లబ్, పాలకొల్లు అధ్యక్షుడు తటవర్తి సుధాకర రావు అన్నారు. ఇటీవల జరిగిన వాకర్స్ అంతర్జాతీయ సమావేశంలో క్లబ్‌కు ప్రకటించిన అవార్డులను వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రాంతీయ ఉపాధ్యక్షుడు జివి.సుబ్బారావు క్లబ్ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, సలాది రామచంద్రరావు, జవ్వాజి కల్యాణ్, బాసిన సత్యనారాయణ, జంపన ప్రసాద్, క్రొవ్విడి సూరయ్య, జహంగీర్, పెద్ద సంఖ్యలో వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు. ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందిన వాకర్స్ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కాగిత సూర్యనారాయణను సత్కరించారు. నూతన సంవత్సర కేక్ కట్ చేసి అందరికీ పంచారు. లక్కీ డిప్ ద్వారా బహుమతులు అందించారు.

ఆచంట : 2025 నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందాలు నింపాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ ఆకాంక్షించారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కార్యకర్తలు, నాయకులు, అభిమానుల మధ్యలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనవర్తి విజయ్ కుమార్, గోడవర్తి చంద్ర శేఖర్, మనవర్తి శుభాకర రావు, గోడవర్తి కృష్ణకుమార్, వస్కా ఉమేష్, మంగిన శ్రీనివాస్, నార్గన శ్రీనివాస్, బాలిన వీరాస్వామి, మాముదూరి శ్రీనివాస్, బండి మహేష్, శీలం చిట్టియ్య, బండి పద్మమోహన్ రావు పాల్గొన్నారు.

అనధికార డంపింగ్ యార్డును నిరోధించాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అనాధికారక డంపింగ్ యార్డ్‌లను నిరోధించాలని జిల్లా జాయింట్ కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా మున్సిపాలిటీలో ఉన్న అనధికార డంపింగ్ యార్డ్‌లు గుర్తించాలన్నారు. అంతేకాకుండా డమ్ చేస్తున్న ప్రాంతాల్లో సిసి కెమెరా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భూమి మార్పిడి నమోదు చేయాలని వినతి

నరసాపురం : అడంగళ్ ఆన్‌లైన్‌లో తన భూమిని కన్వర్షన్ నమోదు చేయాలని కోరుతూ నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ దాసిరాజుకు యర్రంశెట్టిపాలెం మాజీ సర్పంచి కూనపరెడ్డి వీర వెంకట విజయరంగారావు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. మొగల్తూరు మండలం రామన్నపాలెం గ్రామంలో తనకు 2.20 ఎకరాల భూమి ఉందని, ఈ భూమికి 2015 సంవత్సరంలో ల్యాండ్ కన్వర్షన్ కట్టి దానికి సంబంధించిన సర్టిఫికెట్ పొందానని తెలిపారు. ఇప్పటి వరకు తన భూమికి ఆన్‌లైన్ అడంగల్‌లో నమోదు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన భూమిని వెంటనే అడంగళ్ ఆన్‌లైన్లో నమోదు చేయాలని కోరారు. ముందుగా ఆర్‌డిఒ దాసిరాజుకు నూతన సంవత్సర శుభాకాంక్షలను రంగారావు తెలియజేశారు.

ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా సూరిబాబు

తాడేపల్లిగూడెం: ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా ప్రముఖ బిల్డర్, తిరుమల కన్‌స్ట్రక్షన్స్ అధినేత తిరుమళ్ల సూరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక పదంకుమార్ గుప్త వాకర్స్ భవనంలో ప్రస్తుత వాకర్స్ అధ్యక్షులు దూలం నాగరాజు అధ్యక్షతన మంగళవారం జరిగిన వాకర్స్ సర్వసభ్య సమావేశంలో 2025 సంవత్సరానికి గాను వాకర్స్ నూతన అధ్యక్షులుగా సూరిబాబును సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతో వాకర్స్ సంస్థ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. నూతన అధ్యక్షునిగా ఎన్నికైన సూరిబాబుకు నరిసే సోమేశ్వరరావు, కడియాల పరశురామయ్య, మాకా శ్రీనివాస్, దూలం శ్రీనివాసరావు, కాంట్రాక్టర్ శివ, పల్లెల జగన్నాధం శుభాకాంక్షలు తెలిపారు.

ఎపిటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

భీమవరం టౌన్ : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఎపిటిఎఫ్) 2025 సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను భీమవరం నియోజకవర్గ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు ఆయన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు నైతిక విలువలు, పర్యావరణ పరిరక్షణ గురించి కూడా బోధన చేయాలని చెప్పారు. మాజీ ఎఎంసి ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.